క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం

ఒంగోలు: డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు డిపో పరిధిలోని ప్రయాణికులు 9959225695 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయడంతో పాటు సలహాలు, సూచనలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్ల పంపిణీ



విద్యార్థినులకు కాస్మోటిక్ కిట్లు అందిస్తున్న శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి జన్మదినం సందర్భంగా శుక్రవారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 200 మంది బాలికలకు కాస్మోటిక్ కిట్లు అందించారు. విద్యార్థినులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి సూచించారు. అదేవిధంగా పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే నిమిత్తం అవసరమైన గ్యాస్ కొనుగోలుకు ఏడాదికి అయ్యే ఖర్చును నగదు రూపంలో ఏజెన్సీకి అందించారు. తొలుత కేక్ కట్‌చేశారు. ఆలయంలోని సకల దేవతలకు పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, క్వారీల మేనేజర్లు, సిబ్బంది పాల్గొని గజమాలలతో శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వరద బాధితులకు రూ.1.50 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న మాంటిస్సోరి ప్రకాష్‌బాబు

ఒంగోలు: విజయవాడ వరద బాధితులకు స్థానిక మాంటిస్సోరి విద్యాసంస్థల యాజమాన్యం శుక్రవారం రూ.1.50 లక్షల విరాళం అందించింది. ఈ సందర్భంగా మాంటిస్సోరి ప్రకాష్‌ను స్థానిక ఎమ్మెల్యే జనార్దన్ అభినందించారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కిండర్ గార్డెన్ చిన్నారులు

ఒంగోలు: స్థానిక సాయిబాబా సెంట్రల్ స్కూల్లో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కిండర్ గార్డెన్ విద్యార్థులు వారి నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలతో పాల్గొన్నారు. పిల్లలు పెరుగుతున్న కొద్దీ వారికి తరగతి గది నుంచి కాకుండా ప్రత్యక్ష అనుభవం ద్వారా కొన్ని విలువలు నేర్పాలని పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాథుని శృతి తెలియజేశారు. అందుకోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భావి జీవితానికి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. గ్రాండ్ పేరెంట్స్‌కు, వారి మనుమలు, మనుమరాళ్ల సహకారంతో మ్యూజికల్ చైర్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తమ ఆటపాటలతో పెద్దలను మెప్పించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ తమ స్వహస్తాలతో పాఠశాలలో పెంచిన మొక్కలను తమ గ్రాండ్ పేరెంట్స్‌కు బహుమతిగా ఇచ్చారు. గెలుపొందిన గ్రాండ్ పేరెంట్స్‌కు పాఠశాల తరఫున అభినందనలు తెలియజేస్తూ బహుమతులు అందజేశారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాంకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సుందరయ్య భవనంలో నివాళులర్పిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ఒంగోలు సెంట్రల్: సీపీఎం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప కార్యక్రమాన్ని శుక్రవారం మంచి పుస్తకాల దుకాణం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు, సీపీఐ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బీమవరపు సుబ్బారావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పాల్గొని ప్రజా సమస్యలపై సీతారాం పోరాడిన విధానాన్ని వివరించారు. నేటి తరానికి ఆయన ఆదర్శనీయుడని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను వివరించారు. కులనిర్మూలన పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి ఎం.జార్జి, కార్మిక నాయకులు వేజెండ్ల శివరావు, ప్రజాస్వామిక వాదులు ఆవుల సుబ్రహ్మణ్యం, చర్మకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జంద్రాజుపల్లి ఆంజనేయులు, ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి ఏఎల్ ప్రసాద్, ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, వివిధ సంఘాల నాయకులు వెంకటస్వామి, సుబ్బారావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం మండల నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే పోరాట పటిమ కలిగిన వ్యక్తి అని అన్నారు. పార్లమెంట్‌లో ఆయన ఉపన్యాసాలను గుర్తుచేసుకున్నారు. సంకీర్ణ రాజకీయాలలో ఏచూరి కీలక పాత్ర పోషించారని ఆనాటి సంఘటనలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, తొట్టెంపూడి రామారావు, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

సుందరయ్య భవనంలో...

ఒంగోలు టౌన్: దేశంలోని ఫాసిజానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాటం చేయడమే సీతారాం ఏచూరికి ఇచ్చే నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై.సిద్దయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సీతారాం ఏచూరి సంతాప సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య ప్రసంగిస్తూ దేశంలోని అనేక సమస్యల మీద సీతారాం ఏచూరి అలుపెరుగని పోరాటం చేశారని, దేశాభివృద్ధికి ప్రభుత్వాలకు సూచనలు ఇచ్చారని తెలిపారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు ఎం.వెంకయ్య, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు లలితకుమారి, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, వామపక్ష నాయకులు జాలా అంజయ్య, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కె.రమాదేవి, డా.రంగారావు, కంకణాల ఆంజనేయులు, ఎస్కే మాబు తదితరులు పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సును విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు



ఈతముక్కలలో మాట్లాడుతున్న గోపీనాథ్, అశోక్, బాబూరావు, శాంతారావు

ఒంగోలు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం ఒంగోలు అంబేడ్కర్ భవనంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు కోరారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి స్థానిక కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్సీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు తీర్పుతో నిర్ణయించలేరని అన్నారు. రాజ్యాంగ సవరణతో మాత్రమే అది సాధ్యమని వివరించారు. దళితుల మధ్య అనైక్యత కోసమే ప్రభుత్వాలు వర్గీకరణ నాటకం ఆడుతున్నాయని అన్నారు. దళిత వ్యతిరేకుల బారి నుంచి ఎస్సీ రిజర్వేషన్లను కాపాడేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్టికల్ 341ను తీసుకువచ్చారని, దానికి సవరణ చేయకుండా రిజర్వేషన్లు వర్గీకరించలేరని అన్నారు. దళితులను కులాల వారీగా, అందులోనూ ధనిక, పేద వర్గాలుగా విడగొట్టేందుకు ఈ ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో శనివారం ఒంగోలులో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు దార అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈతముక్కలలో సమావేశం...

ఈతముక్కల (కొత్తపట్నం): ఒంగోలు అంబేడ్కర్ భవనంలో ఈ నెల 14న నిర్వహించే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సును విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల సంఘ నాయకులు గోపీనాథ్, అశోక్, కె.బాబూరావు, ఎం.శాంతారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఈతముక్కలలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని మాలలంతా విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి, మాల్యాద్రి పాల్గొన్నారు.

నక్కల సామాజికవర్గాన్ని ఆదుకుంటాం



సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: సంచార నక్కల జాతి కుటుంబాల జీవన స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో పక్కన రహదారిపై గుడారాలు వేసుకుని జీవిస్తున్న వారిని శుక్రవారం విజయరావు బృందం కలిసింది. తమ జీవనం అస్తవ్యస్తంగా ఉందని, దోమలు కుట్టడం వలన అనారోగ్యం పాలవుతున్నామని, సరైన నివాసాలు లేవని, ప్రభుత్వ పథకాలు దరిచేరడం లేదని, రక్తహీనతతో ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి, వైద్యారోగ్య శాఖామంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని విజయరావు హామీ ఇచ్చారు. జిల్లా మహిళా మోర్చా ఇన్‌చార్జి తీగల సత్యవతి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు దేవరపల్లి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ చాంబర్ ఆధ్వర్యంలో పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: జూనియర్ చాంబర్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదో రోజు విద్యార్థులకు స్థానిక కాపు కళ్యాణ మండపంలో పలు పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో డ్రాయింగ్ పోటీలు, ప్రకృతి విధ్వంసం- పరిష్కార మార్గాలు అనే అంశంపై వ్యాసరచన, చిరు కథలు, జోక్స్ పోటీలు నిర్వహించారు. జేసీ చాంబర్ పూర్వ అధ్యక్షుడు పి.రామాంజనేయులు, కసిబిసి నాగేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. ప్రజానాట్యమండలి నాయకుడు, రచయిత, దర్శకుడు బొంతు దశరథ, రచయితల సంఘ నాయకుడు, జర్నలిస్ట్ పొన్నూరు శ్రీనివాసులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం రెడ్ క్రాస్ ప్రాంగణంలో బిజినెస్ పీపుల్ మీట్ జేసీ వారోత్సవాల చైర్మన్ శబరి పి.నాయర్, కార్యదర్శి సాత్విక్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్త అవార్డును ధర్మతేజారెడ్డికి జేసీ అధ్యక్షుడు కేవీ వరుణ్ అందజేశారు. కార్యక్రమంలో జేసీ కో చైర్మన్లు పి.శివకోటిరెడ్డి, గంధవల్ల బాలకృష్ణ, పూర్వ కార్యదర్శి ఎస్.మాల్యాద్రి, సభ్యులు పాల్గొన్నారు.

ఉమా మనోవికాస కేంద్రం సేవలు అభినందనీయం



కార్యక్రమంలో పాల్గొన్న సీఐ

ఒంగోలు సెంట్రల్: మానసిక దివ్యాంగుల ఉన్నతి కోసం స్థానిక కర్నూలు రోడ్డులోని ఉమా మనోవికాస కేంద్రం అందిస్తున్న సేవలు అభినందనీయమని ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు అన్నారు. ఉమా మనోవికాస కేంద్రం 37 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని సంస్థ సేవలను కొనియాడారు. నిర్వాహకుడు ఎస్పీ రెడ్డి, సిబ్బందిని అభినందించారు.

ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మ

మద్దిపాడు: ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ ఆర్.పద్మ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మద్దిపాడు సచివాలయాన్ని ఆమె సందర్శించి ఇంటి పన్ను రికార్డులు పరిశీలించారు. 2024 సంవత్సరానికి సంబంధించి వసూలైన ఇంటి పన్ను వివరాలడిగి తెలుసుకున్నారు. 2023–24 సంవత్సరానికి పన్ను మొత్తం ఎంత, 2024–25 సంవత్సరానికి పన్ను ఎంత అంటూ వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట గ్రామ కార్యదర్శి ఆశాలక్ష్మి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

24న వారాహి మహారథ యాత్ర

ఒంగోలు మెట్రో: ఒంగోలు నగరంలో ఈ నెల 24వ తేదీ వారాహి మహారథ యాత్రను అమ్మవారి దేవాలయాల మీదుగా నిర్వహించనున్నట్లు శ్రీశ్రీశ్రీ మహారుద్రస్వామి తెలిపారు. ఆదివారాహీశక్తి ఆలయం ఆధ్వర్యంలో వారాహి మహారథ యాత్రలో భాగంగా ఒంగోలులోని ఎన్జీవో భవనంలో శుక్రవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం నిర్వహించారు. మహారుద్రస్వామి మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో భాగంగా తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు శ్రీ వారాహి అమ్మవారి మహారథ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 24న ఒంగోలు చేరుకునే మహారథయాత్రలో నగర ప్రజలంతా పాల్గొని వారాహి అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.



పెద్దకొత్తపల్లి నుంచి తీసుకొచ్చిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

కొత్తపట్నం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలలో పలు విగ్రహాలను శుక్రవారం ఏడో రోజు మండలంలోని కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల బీచ్‌లలో నిమజ్జనం చేశారు. ఒంగోలు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి తీరంలో ఒడ్డున పూజలు చేసి నిమజ్జనాలు చేశారు. భక్తులు సముద్రస్నానం ఆచరించి ఇంటికి చేరారు.



ఒంగోలు మిలిటరీకాలనీ వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



ఒంగోలు గద్దలగుంట నుంచి తెచ్చిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

రోడ్డుపై గుంతలు పూడ్చాలి



ట్రాన్స్‌కో ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ప్రతినిధులు


ఒంగోలు సెంట్రల్: అండర్‌గ్రౌండ్ విద్యుత్‌లైన్ కారణంగా స్థానిక మంగమ్మ కళాశాల జంక్షన్ నుంచి కర్నూలు రోడ్డు వరకు బైపాస్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గుంతలు పూడ్చాలని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ కె.శ్రీనివాస్‌ను కలిసి కోరారు. వర్షాలలో గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యారని చెప్పారు. త్వరగా గుంతలు పూడ్చి ఇబ్బందులు తొలగించాలని విన్నవించారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, కోశాధికారి బత్తుల మునలారెడ్డి, టి.భక్తసింగ్, సీహెచ్ వీరరాఘవులు, జి.బీష్మాచారి చౌదరి, పౌరసంఘాల సమైక్య కన్వీనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నవరాత్రులు



సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: గణపతి నవరాత్రి మహోత్సవాలను ఒంగోలు నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాల వద్ద శుక్రవారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినాయకుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజుశివచే భక్తితత్వం భాగవతం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. అనంతరం అగస్త్యరాజుశివను సన్మానించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మంగమూరురోడ్డు ప్రగతికాలనీలో వినాయక మండపంలో కోలాట నృత్య ప్రదర్శనలో మహిళలు